క్లుప్తంగా

నూతన తాగునీటి బోరు ఏర్పాటు



తాగునీటి బోరు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న, కార్పొరేటర్ లక్ష్మణరావు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి త్రినాథపురంలో నూతనంగా మంజూరైన రెండు తాగునీటి బోర్ల ఏర్పాటు పనులను వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు సోమవారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. వార్డులో నీటి ఎద్దడిని నివారించేందుకు నూతన బోర్లు ఏర్పాటుకు ప్రణాళికలను రూపొందించామన్నారు. దాని ప్రకారం అవసరం ఉన్న ప్రాంతాల్లో బోర్లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణ, సూర్యనారాయణ, మధు తదితరులు పాల్గొన్నారు.

ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షురాలిగా ప్రమీలా దేవి



గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజక వర్గం ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షురాలిగా కుప్పిలి ప్రమాలా దేవిని నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్‌జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది. జీవీఎంసీ 56వ వార్డుకు చెందిన ప్రమీలాదేవి మాట్లాడుతూ పార్టీ బలో పేతానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీని నమ్ముకుని ఉన్నందుకు తగిన గుర్తింపు ఇచ్చారని సంతోషం వ్యక్తం చేశారు.

క్రైస్తవులకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ కేటాయించాలి



పాదయాత్ర కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఐక్య క్రైస్తవ కోర్ కమిటీ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: రెండు తెలుగు రాష్ట్రాల క్రైస్తవుల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను కేటాయించాలని ఆలిండియా ఐక్య క్రైస్తవ జేఏసీ కోర్ కమిటీ చైర్మన్ తుమాటి బాబూరావు కోరారు. ద్వారకానగర్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రైస్తవుల అభ్యున్నతి, సంక్షేమం, భద్రత కోసం మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. దీని వల్ల క్రైస్తవుల విద్యాలయాలు, దేవాలయాలు, వైద్యాలయాలను కాపాడుకోగలమని తెలిపారు. ఈ డిమాండ్ సాధనకు జూలై 31న విశాఖ బీచ్ రోడ్డులోని వైఎంసీఏ లేదా వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి క్రైస్తవులు భారీ పాదయాత్ర నిర్వహించాలనుకుంటున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రలో నగర క్రైస్తవులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పాదయాత్ర కరపత్రికను కోర్ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయా ప్రాంతాల పాస్టర్లు ఎజ్జల బాలరాజు, లోపింటి శామ్యూల్, బాబ్జీరావు, కె.సాంబశామ్యూల్, రమేష్, ఎస్తేరు రాణి ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ ఎస్తేరు రాణి తదితరులు పాల్గొన్నారు.

గృహ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఎఫ్‌టీయూఐ జాతీయ అధ్యక్షుడు కనకారావు

డాబాగార్డెన్స్: ఐఎల్‌వో కన్వెన్షన్ నెం.189 ఒప్పందం ప్రకారం గృహ కార్మికులకు కనీస వేతనాలు, సామాజిక భద్రత వంటివి ఇతర వర్గాల కార్మికుల మాదిరిగానే అమలు చేసేందుకు సమగ్ర చట్టం చేయాలని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఫ్రీ ట్రేడ్ యూనియన్స్ ఆఫ్ ఇండియా (సీఎఫ్‌టీయూఐ) జాతీయ అధ్యక్షుడు ఎన్.కనకారావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 15వ అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం సందర్భంగా సీఎఫ్‌టీయూఐ ఆధ్వర్యంలో నగరంలోని ఓ హోటల్‌లో గృహ కార్మికుల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని అన్ని కార్మిక సంఘాల్లో అత్యధిక సంఖ్యలో గృహ కార్మికులకు సీఎఫ్‌టీయూఐ ప్రాతినిధ్యం వహిస్తోందన్నారు. గృహ కార్మికుల స్థితిగతులు పరిశీలించడానికి, తగిన శాసనపరమైన చర్యలు సిఫార్సు చేయడానికి నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

వాకింగ్ పార్కులో సమస్యల తిష్ట



అలంకారప్రాయంగా వాటర్ ట్యాంకు

- అపరిశుభ్రం చేస్తున్న ఆకతాయిలు
- కంపుకొడుతున్న బాత్‌రూమ్‌లు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న వాకర్స్

మల్కాపురం: ఆరోగ్యం కోసం వాకింగ్ పార్కుకు అనారోగ్య సమస్యలు కొని తెచ్చుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. దీనికి తోడు పార్కులో రాత్రిపూట ఆకతాయిలు చేరి అపరిశుభ్రం చేస్తున్నారు. మద్యం సేవించడం.. అక్కడే వ్యర్థాలు వేస్తున్నారు. ఇదీ జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వాకింగ్ పార్కులో పరిస్థితి.

అవస్థల మయం

పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు ఇక్కడ ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తారు. అయితే వాకర్స్ సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మించారు. వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేశారు అయితే కనెక్షన్ ఇవ్వలేదు.దీంతో ట్యాంక్‌లోకి మంచినీరు రావడం లేదు. మరో వైపు మరుగుదొడ్లు నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. వాస్తవానికి పార్కులో నైట్ వాచ్‌మన్ ఉండాలి. ఆకతాయిలు రాకుండా చర్యలు తీసుకోవాలి. వాచ్‌మన్ లేకపోవడంతో ఆకతాయిలు, మందుబాబులు చేరి పార్కును చెత్తమయం చేస్తున్నారు. ఫలితంగా తాము అవస్థలు పడుతున్నామని వాకర్స్ వాపోతున్నారు. రాత్రి సమయాల్లో పోలీసుల గస్తీ ఏర్పాటు చేసి ఆకతాయిలకు కళ్లెం వేయాలని వాకర్స్ కోరుతున్నారు.



కంపుకొడుతున్న మరుగుదొడ్డి



పార్కు ముఖద్వారం



సమస్యలను వివరిస్తున్న వాకర్స్

ఉపాధ్యాయులకు బోధనపై శిక్షణ



అవగాహన కల్పిస్తున్న వాసుదేవరావు

మల్కాపురం: మారుతున్న కాలానికి తగ్గట్టుగా బోధన ఉండాలని లక్కీ అమర్‌పాఠశాల ప్రిన్సిపాల్ వాసుదేవరావు అన్నారు.58వ వార్డు పిలకవానిపాలెంలోని లక్కీ అమర్ పాఠశాలలో ఎయిమ్ అకాడమీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నూతన విద్యా విధానానికి అనుగుణంగా ఉపాధ్యాయులు నడుచుకోవాలన్నారు.ఒత్తిడి లేని చదువులను అందించాలన్నారు.ప్రతి విద్యార్థిని క్షుణంగా గమనించి..ఆ విద్యార్థికి బోధన ఎలా అందిస్తే శ్రద్ధ చూపుతాడో తెలుసుకుని,నడుచుకోవాలన్నారు. బట్టీ విధానానికి స్వస్తి చెప్పాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో హైదరాబాద్ నుంచి వచ్చిన సుందర్,జ్ఞానేంద్ర, పద్మ వంటి నిపుణులు పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పరుశురాం, సత్యనారాయణ,రంగనాథ్,శక్తి,త్రినాథ్,లక్ష్మణరావు, వేణుగోపాల్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



రోడ్డు పనులు పరిశీలిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డులో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను సోమవారం మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరిశీలించారు. పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సంజీవయ్యనగర్‌లో కళావేదిక వద్ద మెట్ల మార్గం, చిన్న పార్క్‌లో అభివృద్ధి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అంబేడ్కర్‌నగర్‌లో రూ.5లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులు పరిశీలించారు. ఎస్‌ఏడీ జంక్షన్ సమీప బస్ స్టాప్ వద్ద రానున్న వర్షాకాలం నేపథ్యంలో ప్రయాణికులకు ఎటువంటి సదుపాయాలు కలిప్పించాన్న అంశాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి అనూప్, స్థానికులు పాల్గొన్నారు.

ఏఈకి సమ్మె నోటీసు అందజేత



ఏఈ సింహాచలంకు సమ్మె నోటీసు అందిస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు

గోపాలపట్నం: జోన్–8 మంచినీటి సరఫరా విభాగం అవుట్ సోర్సిగ్ కార్మికులు సోమవారం బుచ్చిరాజుపాలెం కార్యాలయంలో ఏఈ సింహాచలంకు సమ్మె నోటీసు అందించారు. జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం ప్రకారం ఈ నెల 26వ తేదీలోగా వేతనాలు చెల్లించాలని.. లేని పక్షంతో 27 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని నోటీసులో పేర్కొన్నారు. గతంలో సమ్మె నోటీసు ఇచ్చిన సందర్భంగా పెరిగిన వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని కార్మికులు తెలిపారు. అయితే వారు ఇచ్చిన హామీ ప్రకారం ఇంతవరకు చెల్లించక పోవడంతో సమ్మె నోటీసు ఇచ్చామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రెడీనెస్ మేళా



చిన్నారులతో కార్పొరేటర్ లక్ష్మణరావు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్ జీవీఎంసీ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం నిర్వహించిన రెడీనెస్ మేళాను వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ముఖ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యావిధానంలోని మార్గదర్శకాలకు అనుగుణంగా చిన్నారుల్లో విద్యాభ్యాసంపై ఆసక్తి పొంపొందించే చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల వాతావరణానికి చిన్నారులను సన్నద్ధం చేయడమే స్కూల్ రెడీనెస్ మేళా ఉద్దేశ్యమన్నారు. సమగ్ర అభివృద్ధిలో భాగంగా పాటలు, కథల ద్వారా భాషాభివృద్ధి, బొమ్మల ద్వారా గణిత సంబంధిత చర్యలు, ఆటల ఆధారిత విద్యా కార్యక్రమాలు, వ్యక్తిగత నైపుణ్యాల వికాసానికి అనుగుణంగా విద్య అందుతుందని చెప్పారు. బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరికృష్ణ, సూపర్‌వైజర్ సత్యవతి, జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్‌లాల్, వైద్యులు చింతా ప్రభాకర్, అంగన్‌వాడీ టీచర్లు బల్ల భారతి, పద్మకుమారి, ద్రాక్షాయిని, అర్చన, యశోధ తదితరులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

23న స్పాట్ పెయింటింగ్ పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న అర్థికా, గ్రీన్ ట్రీ ట్రస్ట్ వ్యవస్థాపకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డీఏవీ పాఠశాలలో ఈనెల 23న స్పాట్ పెయింటింగ్ పోటీలు నిర్వహించనున్నట్టు అర్థికా వ్యవస్థాపకుడు జి.ఆర్. శ్రీహరి, గ్రీన్ ట్రీ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దొడ్డి సన్నిబాబు తెలిపారు. సోమవారం వారు వివరాలు వెల్లడించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేడుకల్లో భాగంగా పెయింటింగ్ పోటీలతో పాటు చెట్లు నాటే కార్యక్రమం, ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రదర్శన ఏర్పాటు చేశామని తెలిపారు. ఆసక్తి కలిగిన పాఠశాలలు తమ విద్యార్థుల పేర్లను ఈనెల 19లోగా నమోదు చేసుకోవాలని కోరారు. ఒక్కో పాఠశాల నుంచి 20 మంది విద్యార్థులను మాత్రమే అనుమతిస్తామన్నారు. పూర్తి వివరాలకు 98853 11575, 94412 74416 నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

మోద కొండమ్మా.. చల్లగ చూడమ్మా



సారె ఊరేగిస్తున్న మహిళలు



అమ్మవారి ప్రతిమలు ఊరేగిస్తున్న భక్తులు



విద్యుత్ కాంతుల్లో మోద కొండమ్మ ఆలయం

గోపాలపట్నం: స్థానిక ఇందిరానగర్‌లో వెలసిన మోదకొండమ్మ అమ్మవారి ఉత్సవాలు అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం అమ్మవారి సారె ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం గ్రామ పెద్దలు మహిళలు కలసి సారె ఊరేగించారు. అనంతరం అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

- సాయంత్రం ఘటాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. స్థానిక మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి ప్రతిమలు గ్రామంలో ఊరేగించారు. వాటితో పాటు పలు వీధుల్లో మేళ తాళాలతో ముందుకు కదిలారు.

పండగకు ఏర్పాట్లు...

మంగళవారం అమ్మవారి ప్రధాన పండగ నేపథ్యంలో ఆలయంతో పాటు ఇందిరానగర్, లక్ష్మీనగర్ ప్రాంతాలను విద్యుత్ వెలుగులతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మజ్జిగ, మంచినీరు, పులిహోర, చక్కెర పొంగలి ప్రసాదాలు అందించనున్నారని కమిటీ సభ్యులు తెలిపారు.

జేపీఎల్ విజేత పరవాడ జట్టు

రన్నరప్ గాజువాక జట్టు

తాటిచెట్లపాలెం: జర్నలిస్ట్స్ ప్రీమియర్ లీగ్(జేపీఎల్) విజేతగా పరవాడ జట్టు నిలిచింది. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో పోర్టు స్టేడియంలో 5 రోజుల పాటు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మ్యాచ్‌లు జరిగాయి. సోమవారం రాత్రి నిర్వహించిన ఫైనల్స్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన గాజువాక జట్టు 75 పరుగులు చేయగా.. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పరవాడ జట్టు ఒక బాల్ మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించి, ట్రోఫీని సొంతం చేసుకుంది. గాజువాక జట్టు రన్నరప్‌గా నిలిచింది. మ్యాచ్‌ల ముగింపు కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.రాము, ప్రధాన కార్యదర్శి ఆర్.రామచంద్రరావు, స్మాల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సత్యనారాయణ, ఏపీయూడబ్ల్యూజే గాజువాక శాఖ అధ్యక్షుడు కె.పరశురాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.చంద్రమోహన్, హరనాథ్, నారాయణ గ్రూప్ గంటా రవి, శృతి టిఫిన్స్ రాజు, పవిత్ర రెడ్డి కన్‌స్ట్రక్షన్స్ శ్రీనవాస్‌రెడ్డి, టెక్ విజన్ రాజీవ్ సెంటా, ఈటోర్ నాగేశ్వరరావు, మై పైసా ఎర్రాజీ, పెప్సీ జోగేంద్రకుమార్, సుమంత్ అసోసియేట్స్ సుమంత్, గోల్డెన్ ఫ్యూచర్ డెవలపర్స్ శ్రీనివాస్, శ్రీ బాలాజీ డెవలపర్స్ గణేష్‌కుమార్, లక్కీ షాపింగ్‌మాల్ స్వామి, మ్యాక్ డాక్టర్ శ్రీవల్లి, శ్రీ కశ్యప్ విద్యానికేతన్ కె.శ్రీనివాస్, నిర్వాహకులు రవి, చందు యాదవ్, అవతార్ యాదవ్, రాహుల్, భరత్ మిత్ర బృందం, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను తక్షణం పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి శ్యామలాదేవి

మద్దిలపాలెం: అంగన్‌వాడీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్యామలాదేవి డిమాండ్ చేశారు. ఇసుకతోట కృష్ణ మందిరం రోడ్డులోని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ అంగన్‌వాడీ సెంటర్ వద్ద సోమవారం అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతున్న ప్రజా సాధికార సర్వేలో అంగన్‌వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగి అనే నమోదును ప్రక్రియ నుంచి తొలగించాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ అంగన్‌వాడీ టీచర్లు, మినీ టీచర్లు, ఆయాలకు కచ్చితంగా వర్తింపజేయాలన్నారు. ప్రతి నెలా 5వ తేదీకి గౌరవ వేతనాల బిల్లును అకౌంట్‌లో జమ చేయాలని కోరారు. పిల్లలకు వండి వడ్డించే మెనూ రేట్లు పెంచాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు సరకులన్నీ ప్రభుత్వమే చేర్చాలని సూచించారు. ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు వెంటనే పెంచాలని, అంగన్‌వాడీ సెంటర్లకు రేషన్ సన్న బియ్యం సప్లై చేయాలని డిమాండ్ చేశారు. యాప్స్‌ను తక్షణమే సవరించాలని కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు రమాదేవి, పి.కృపారాణి, రమ తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలో ఆందోళన



మండుటెండలో ఆందోళన చేస్తున్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణకు కార్మిక సంఘాలు సోమవారం మండుటెండలోనే ఆందోళన తెలిపాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరం షెడ్ కూలిపోయింది. అయితే ఆ షెడ్ తిరగి నిర్మించడానికి పోలీసులు అనుమతించలేదు. దీంతో ఆందోళనకారులు చేసేది లేక మండుటెండలో గొడుగులు పట్టుకొని తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్.రామారావు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంలో అడ్డగోలుగా జరుగుతున్న నూతన నియామకాలు ఆపాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌ను అమ్మాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సత్యనారాయణ, భానుమూర్తి, సూరిబాబు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

2.5 కిలోల గంజాయి పట్టివేత



ఎక్సైజ్ అధికారుల అదుపులో గంజాయి, రవాణాదారుడు

విశాఖ సిటీ: ఒడిశా నుంచి బెంగుళూరుకు గంజాయి తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వ్యక్తిని ఎక్సైజ్ శాఖ అధికారులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.వి.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ సిబ్బంది జ్ఞానాపురంలో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో రాజేష్ అనే వ్యక్తి వద్ద 2.5 కిలోల గంజాయిని గుర్తించారు. అతడిని విచారించగా.. ఒడిశా రాష్ట్రంలో దర్లిపుట్ నుంచి కేజీ రూ.5 వేలకు కొనుగోలు చేసి అధికంగా అమ్ముకునేందుకు బెంగళూరుకు వెళ్తున్నట్లు చెప్పాడు. దీంతో అతడిని అరెస్టు చేసి సీతమ్మధార ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ సిహెచ్.రాజేశ్వరి, ఎస్‌ఐ ఎల్.అరుణకుమారి, హెచ్‌సీ కె.వెంకటరావు, కానిస్టేబుళ్లు కె.వీరభద్రరావు, జి.విజయ్‌కుమార్, ఎ.దేవీచంద్ర, ఎన్.తిరుపతిరావు, ఎం.మహేశ్వరి పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



జగదాంబ జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ప్రతినిధులు

డాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో అక్రమంగా తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మధరావు డిమాండ్ చేశారు. కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధం ఆపాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు మద్దతుగా జగదాంబ జంక్షన్లో అఖిల పక్ష కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. నిరసనలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతామన్న కూటమి ప్రభుత్వ పెద్దలు కార్మికుల ఉపాధినే కాపాడలేకపోయారని విమర్శించారు. 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నడుస్తున్న స్టీల్‌ప్లాంట్‌లో అదనంగా 6 వేల మంది కార్మికులు అవసరం ఉన్నా, పనిలో ఉన్న 4500 మంది కార్మికులను అక్రమంగా తొలగించడాన్ని తప్పుబట్టారు. కార్మికులు తమ ఉపాధి రక్షణకు పోరాడుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కక్షపూరితంగా వ్యవహరించి పోలీసులతో, బెదిరింపులతో ఉద్యమాన్ని అణిచివేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న విశాఖ వస్తున్న ప్రధాని మోదీతో స్టీల్‌ప్లాంట్ రక్షణ, కార్మికుల ఉపాధిపై ప్రకటన చేయించాలని కోరారు. నిరసనలో ఏపీఎఫ్‌టీయూ నాయకుడు కె.దేవా, సిటూ నాయకులు పి.వెంకట్‌రెడ్డి, పి.మణి, ఎం.సుబ్బారావు, పి.వెంకట్రావు, వి.నరేంద్రకుమార్, ఏఐటీయూసీ నాయకులు ఎస్‌కే రెహ్మాన్, సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ నాయకుడు డి.వెంకటరమణ, డీవైఎఫ్ఐ నాయకురాలు డి.ఉమాశైలజ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో విజేతలుగా నిలవాలి

ఉక్కునగరం: జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచి స్టీల్‌ప్లాంట్ ఖ్యాతి పెంచాలని స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగం అధికారులు ఆకాంక్షించారు. ఈ నెల 19 నుంచి 25 వరకు హర్యానా రాష్ట్రంలోని రోహతక్‌లో స్టీల్ ప్లాంట్స్ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో అండర్–17 జాతీయ బాక్సింగ్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి సాయి కౌశిక్, కిరణ్ సాయిలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఉక్కు స్పోర్ట్స్ విభాగంలో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులను విభాగం అధికారులు అభినందించారు.

భవిష్యత్తులో మరిన్ని జాతీయ పోటీల్లో పాల్గొనాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఘోష్, ఎ.కె. ఘడాయ్, ఎం.వి. మురళీమోహన్, బాక్సింగ్ కోచ్, నేషనల్ రిఫరీ కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సమస్యలకు సత్వరం పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

విశాఖ–లీగల్: న్యాయ స్థానాలలో వయోవృద్ధులకు సంబంధించిన వివాదాలు త్వరితగతిన పరిష్కారం కానున్నట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు స్పష్టం చేశారు. సోమవారం కోర్టు ఆవరణలో ప్రపంచ వయోవృద్ధుల వేధింపులపై అవగాహన దినోత్సవాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంరక్షణ చట్టంలోని పలు కీలక అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా న్యాయ పీఠం అధ్యక్షులు జి.వల్లభనాయుడు, జిల్లా దివ్యాంగులు, వయోవృద్ధుల సంరక్షణ అధికారి కె.కవిత, సామాజిక కార్యకర్త ఎం.సత్యనారాయణ, న్యాయసేవాధికార సంస్థ ప్యానెల్ న్యాయవాదులు, పారా న్యాయ సహాయకులు, వయోవృద్ధులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.